నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, మంగళవారం 13 ఆగస్టు 2024 | NALGONDA

వచ్చే నెల నుంచి ఉద్యోగులందరికీ అటెండెన్స్ యాప్

● నల్లగొండ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్లగొండ రూరల్, ఆగస్టు 12 : వచ్చే నెల 1నుంచి జిల్లా మొదలుకొని గ్రామ పంచాయతీ వరకు ఉద్యోగులందరికీ అటెండెన్స్ యాప్ నిర్వహించనున్నట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఈ నెల 16నుంచి వారం రోజుల పాటు మరోసారి ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి జ్వర సర్వేలో వివరాలు సేకరించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉదయం 8 గంటల్లోపు జాతీయ పతాక ఆవిష్కరణ పూర్తి చేయాలన్నారు. పంచాయతీల్లో వన మహోత్సవంలో పంపిణీ చేసిన మొక్కలను నాటాలని, ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్ఓ డి.రాజ్యలక్ష్మి, డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెల్మినేడులో ఫార్మాసిటీ?

ఏర్పాటు చేయనున్నారని జోరుగా ప్రచారం

అదేం లేదంటున్న అధికారులు

ఇప్పటికే ఈ ప్రాంతంలోని కంపెనీలతో కాలుష్యం

ఫార్మాసిటీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రైతులు, ప్రజలు

గతంలో భూసేకరణ సర్వే అడ్డగింత



గతంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం వెల్మినేడులో ప్రభుత్వం సేకరించిన భూమి

చిట్యాల, ఆగస్టు 12 : మండలంలోని వెల్మినేడులో ఫార్మాసిటీ ఏర్పాటు చేయనున్నారని మీడియాలో కథనాలు వస్తుండటంతో ఆ ప్రాంతానికి చెందిన రైతులు, ప్రజలు అందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న ఫార్మా కంపెనీల వల్ల పంట పొలాలు దెబ్బతిని రైతులు, కాలుష్యాన్ని తట్టుకోలేక ప్రజలు ఇబ్బంది పడుతుండగా ఏకంగా ఫార్మాసిటీని నిర్మిస్తారని ప్రచారం జరుగుతుండటంతో స్థానికుల్లో కలవరం మొదలైంది. గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం ముచ్చర్లలో పెద్దఎత్తున భూసేకరణ చేసింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానంతో ఆ ప్రాంతంలో ఫార్మాసిటీని రైతులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో ప్రభుత్వం కూడా ఒకే ప్రాంతంలో ఫార్మాసిటీ నిర్మిస్తే వ్యతిరేకత వస్తున్నందున రాష్ట్రంలోని దాదాపు 10 ప్రాంతాల్లో ఫార్మాసిటీలను నిర్మించటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తుంది. అందులో భాగంగా నల్లగొండ జిల్లాలోని వెల్మినేడులో ఫార్మాసిటీని నిర్మించాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతమైతే ప్రభుత్వ ఆలోచనా విధానాలకు అనుగుణంగా ఉండటంతో ఇక్కడే ఫార్మాసిటీ నిర్మిస్తారని అంటున్నారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు దగ్గరలో, దేశంలోని ప్రధాన రహదారులలో ఒకటైన 65 నంబర్ జాతీయ రహదారిని ఆనుకొని ఉండటం, ఇప్పటికే ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం భూసేకరణ జరుగడం వంటివి ప్రభుత్వానికి అనుకూలించే విషయాలు.

గతంలో డ్రైపోర్టు, ఇండస్ట్రియల్ పార్కుకు సన్నాహాలు

మొదట ఇక్కడ ఉన్న ప్రభుత్వ భూముల్లో డ్రైపోర్టు నిర్మిస్తారని ప్రచారం జరిగినప్పటికీ తదుపరి ఇండస్ట్రియల్ పార్కు కోసం అని ఈ ప్రాంతంలో ఉన్న 162.28 ఎకరాల ప్రభుత్వ భూమికి ఆనుకొని గతంలో రైతులకు పంపిణీ చేసిన 313 ఎకరాల భూమిని కూడా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు. ఇందు కోసం సర్వే చేయడానికి అధికారులు వెళ్లగా ఆ ప్రాంతానికి చెందిన రైతులు అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రక్రియ అక్కడితో నిలిచిపోయింది. ఇదే ప్రాంతంలో మరికొంత భూమిని సేకరించి ఇండస్ట్రియల్ పార్కు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తున్నప్పటికీ స్థానిక అధికారులు మాత్రం తమకు ఎలాంటి సమాచారం లేదని అంటున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే వెల్మినేడు, పిట్టంపల్లి గ్రామాల మధ్య ఉన్న కెమికల్ కంపెనీలు వెదజల్లుతున్న కాలుష్యంతో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటుండగా జీవాలు కూడ అనారోగ్యం బారిన పడుతున్నాయి. పంటపొలాలు దెబ్బతింటుండటంతో రైతులు, ప్రజలు పలు సందర్భాలలో ఆందోళనలు నిర్వహించారు .కాగా కొత్తగా ఫార్మా సిటీ నిర్మిస్తే పదుల సంఖ్యలో ఫార్మా కంపెనీలు వస్తాయని, జనజీవనం పూర్తిగా దెబ్బతింటుందని పలువురు పేర్కొంటున్నారు. ఇటాంటి ఆలోచనను ఆరంభంలోనే వ్యతిరేకించాలని పలువురు పర్యావరణ ప్రేమికులు తెలియజేస్తున్నారు.

ఫార్మాసిటీ వస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తాం

ఈ ప్రాంతంలో ఫార్మాసిటీని నిర్మిస్తే ప్రజలు, రైతుల సహకారంతో తీవ్రంగా వ్యతిరేకిస్తాం. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న కంపెనీలతో కాలుష్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఆ కంపెనీలు కాకుండా కొత్త కంపెనీలు వస్తే వాటిని ఏర్పాటు చేయకుండా ప్రతిఘటిస్తాం. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామన్న ప్రాంతంలో కాలుష్య రహిత కంపెనీలే నిర్మించాలి.

-దేవరపల్లి సత్తిరెడ్డి, వెల్మినేడు మాజీ ఎంపీటీసీ

కలెక్టర్ ఉత్తర్వులు రాలేదన్నారు

ఫార్మాసిటీ నిర్మాణంపై వస్తున్న వార్తల నేపథ్యంలో కలెక్టర్‌ను కలువగా అలాంటిదేమీ లేదని చెప్పారు. భూ సేకరణకు కూడా ఉత్తర్వులు రాలేదన్నారు. ఒకవేళ ఈ ప్రాంతంలో ఫార్మాకంపెనీ వస్తే రైతు శ్రేయస్సు కోసం వ్యతిరేకిస్తాం.

-బొంతల చంద్రారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు

ఎలాంటి ఆదేశాలు రాలేదు

కొత్తగా భూ సేకరణ కోసం మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. గతంలో ఉన్న ఉత్తర్వుల ప్రకారం అప్పట్లో భూ సేకరణ కోసం సర్వే నిర్వహించడానికి వెళ్లగా రైతులు వ్యతిరేకించిన విషయం తెలిసిందే.

-డి. కృష్ణ, చిట్యాల తాసీల్దార్

డ్రగ్స్ నియంత్రణపై అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్

మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

● గంజాయి వాడకంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి

● గ్రామాలు, పట్టణాల్లో వారం రోజుల పాటు విస్తృత ప్రచారం చేయాలి

● మీడియా ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ, ఆగస్టు 12 : గంజాయి, డ్రగ్స్ వాడకాన్ని నిర్మూలించి నల్లగొండను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. 'నేను గంజాయి వాడను' అనే నినాదంతో ఈ నెల 14నుంచి వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా సామాజిక మాధ్యమాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని మీడియా ప్రతినిధులకు సూచించారు. మాదక ద్రవ్యాల వాడకాన్ని నివారించాలనే ఆలోచనతో జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో చేపట్టిన మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం మీడియా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లోనూ గంజాయి వాడకం జరుగుతుందని తమ దృష్టికి వచ్చిందని, కొన్ని మెడికల్ షాపుల్లో ప్రిస్క్రిప్షన్స్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తున్నారని అన్నారు. సినిమాల వల్ల, స్నేహితుల వల్ల యువత గంజాయికి బానిస అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని రూపుమాపడానికి మీడియా ప్రధాన బాధ్యత చేపట్టి గంజాయి వల్ల జరిగే అనర్థాలను వివరించాలని సూచించారు. 'నేను గంజాయి వాడను' అనే నినాదంతో యూట్యూబ్‌లు, పత్రికలు, చానళ్లలో ప్రసారం చేయడంతోపాటు వారం రోజులు ప్రతిఒక్కరూ డీపీ పెట్టుకోవాలని అన్నారు. జిల్లాలో గంజాయి వాడకం పెరుగుతుందని, నియంత్రించకపోతే రానున్న రోజుల్లో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలపై వారం రోజులు జిల్లాలో అవగాహన కల్పించడంతోపాటు అనుమానం ఉన్నవారికి పరీక్షలు చేసి కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ వారంలో 120 మందికి కౌన్సిలింగ్ ఇచ్చామని, ఇక నుంచి అన్ని శాఖల భాగస్వామ్యంతో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. గంజాయి అమ్మినా, తీసుకున్నా, రవాణా చేసినా జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. గంజాయి క్రయ, విక్రయాలు, సేవింపులు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 87126 70266కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ వినియోగం జరుగుతున్నదన్నారు. కామినేని దవాఖానలో రెండు రీహాబిలిటేషన్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. అంతకుముందు సైక్రియాట్రిస్ట్ శివరామ క్రిష్ణ గంజాయి వల్ల జరిగే నష్టాలు, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. గంజాయిపై రాసే వార్తలపై డీపీఆర్వో వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు నాయక్, డీఎంహెచ్ఓ శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్ పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా నిలిచిన నీటి విడుదల

సాగర్ క్రస్ట్ గేట్ల మూసివేత

● ఇన్‌ఫ్లో తగ్గడంతో నీటి విడుదల నిలిపివేత

● క్రస్ట్ గేట్ల ద్వారా 8రోజుల్లో దిగువకు 175 టీఎంసీలు

నందికొండ, ఆగస్టు 11 : నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టడంతో ఎన్నెస్పీ అధికారులు సోమవారం డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను నిలుపుదల చేశారు. నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో భారీగా రావడంతో ఈ నెల 5న క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభించారు. 5నుంచి 12వరకు రోజూ 2నుంచి 3లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. 8రోజుల పాటు 175 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 8 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగించగా.. ఎగువ నుంచి వరద ఉధృతి తగ్గడంతో క్రస్ట్ గేట్లను క్రమంగా తగ్గిస్తూ సోమవారం మధ్యాహ్నం 2గంటలకు పూర్తిగా నిలుపుదల చేశారు. వరద ఉధృతిని బట్టి క్రస్ట్ గేట్ల ద్వారా మళ్లీ నీటి విడుదల చేపడుతామని ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకు గానూ ప్రస్తుతం 588.80 (308.4658 టీఎంసీలు) అడుగుల మేర నీరు నిల్వ ఉంది. సాగర్ రిజర్వాయర్ పూర్తి స్థాయికి చేరుకోవడంతో నిండుకుండలా మారి జలకళను సంతరించుకుంది. కృష్ణా పరీవాహక ప్రాంతాల్లోని ఆల్మట్టి, నారాయణపుర్, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు 1,29,430 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 47,319 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతుంది. ఎడమ కాల్వ ద్వారా 8,541 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 6,253, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,125, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుంది.

టెయిల్‌పాండ్ నుంచి నీటి విడుదల నిలిపివేత

అడవిదేవులపల్లి, ఆగస్టు 12 : మండల కేంద్రానికి చేరువలో ఉన్న టెయిల్‌పాండ్ ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదలను సోమవారం నిలిపివేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి సుమారు 29,841 క్యూసెక్కుల నీరు వస్తుందని ఏఈ జైపాల్ తెలిపారు. టెయిల్‌పాండ్ నీటి నిల్వ సామర్థ్యం 7.080 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 6.501 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు చెప్పారు.

ఏకేబీఆర్ ఎగువకు నీళ్లేవి?

నీళ్లందక ఎండిపోయిన డిస్ట్రిబ్యూటరీ -7బీ కాల్వ

ఏకేబీఆర్‌లో సరిపడా నీటి మట్టం లేకపోవడంతో డిస్ట్రిబ్యూటరీ -7బీ కాల్వకు అందని నీళ్లు

● ఎడారిగా మారిన వేల ఎకరాల ఆయకట్టు

● సాంకేతిక లోపంతో 60 క్యూసెక్కులకు పారేది 30 క్యూసెక్కులే..

డీ-7బీ కాల్వలో పారని నీళ్లు

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 11 : ఎగువన కురిసిన వర్షాలకు కృష్ణమ్మ పరుగులు తీస్తుంది. రిజర్వాయర్ల నుంచి లక్షల క్యూసెక్కుల నీరు దుంకుతుంది. కానీ.. రిజర్వాయర్ నుంచి నేరుగా ఉన్న డిస్ట్రిబ్యూటరీకి మాత్రం అధికారుల నిర్లక్ష్యంతో నీరందని పరిస్థితి దాపురించింది. అనుకున్న సమయంలో నీటిని సరిపడా నిల్వ చేయలేక, రిజర్వాయర్ నింపకపోవడంతో డిస్ట్రిబ్యూటరీ - 7బీ కాల్వకు నీరందడం లేదు. దీనికితోడు కాల్వపై నిర్మించిన బ్రిడ్జిల సాంకేతిక లోపంతో 60 క్యూసెక్కులకు గానూ 30 క్యూసెక్కులు కూడా పారని దుస్థితి.

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) పరిధిలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎగువ ఆయకట్టుకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో గత కాంగ్రెస్ ప్రభుత్వం ఏకేబీఆర్ నుంచి డిస్ట్రిబ్యూటరీ -7బీ కాల్వను నిర్మించింది. దీని ద్వారా ఏకేబీఆర్ నుంచి 242 ఎఫ్ఆర్ఎల్‌లో నేరుగా 60 క్యూసెక్కుల నీటిని తరలించి పీఏపల్లి, గుర్రంపోడ్ మండలాల్లోని 5,200 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు డిజైన్ చేశారు. కానీ.. ప్రస్తుతం ఏకేబీఆర్‌లో సరిపడా నీటి మట్టం లేకపోవడతో డిస్ట్రిబ్యూటరీ-7బీ కాల్వ ఎండిపోయింది. ప్రస్తుతం అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 242 అడుగుల దిగువన ఉండడంతో కాల్వలోకి నీరు పారడం లేదు. రిజర్వాయర్ ఉన్న అప్రోచ్ కెనాల్‌కు ఏకేబీఆర్ నీటిమట్టం సరిపోక కాల్వలోకి చుక్క నీరు పారని దుస్థితి ఏర్పడింది. ఏకేబీఆర్ నుంచి పోతిరెడ్డిపల్లి, గుడిపల్లి, జూనూతల వరకు ఇప్పటికే కాల్వ నిర్మాణం పూర్తయింది. గుడిపల్లి పరిధిలోని పలుగు చెరువు, గార్లకుంట, గర్రంపోడు మండలంలోని మైలాపురం, జూనూతల చెరువులను నింపాల్సి ఉండగా.. వర్షాకాలంలోనే నింపలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో చెరువుల కింద ఆయకట్టుతోపాటు భూగర్భ జలాలు కూడా పడిపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఏఎమ్మార్పీ నుంచి మూడు మోటార్ల ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అందులో 520 క్యూసెక్కులు జంట నగరాలకు, వెయ్యి క్యూసెక్కులు ప్రధాన కాల్వకు, మరో మూడు వందల క్యూసెక్కులు లింక్ కెనాల్‌కు, మోటార్లు మరియు డీ-7ఎ, డీ-7, 8, 9లకు వదలడంతో ఏకేబీర్ నీటి మట్టం పెరుగని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వరి నాట్ల సీజన్ కావడంతో ఏ కాల్వకూ నీటిని నిలుపుదల చేయలేకపోవడంతో ఏకేబీఆర్ నీటి మట్టం తగ్గి 7బీ కాల్వకు నీరు అందడం లేదు. తక్షణమే నాలుగో మోటార్‌ను రన్ చేసి ఏకేబీఆర్ నీటి మట్టం పెంచి 7బీ కాల్వకు నీటిని విడుదల చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

శాపంగా మారిన సాంకేతిక లోపం

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డిస్ట్రిబ్యూటరీ - 7బీ కాల్వ నిర్మాణంలో సాంకేతిక లోపం ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. అప్పట్లో జిల్లా మంత్రి తన నియోజవర్గంలోని గుర్రంపోడు మండలానికి ఏఎమ్మార్పీ కెనాల్ ఎగువ ప్రాంతానికి సాగునీరందించాలని ఆగమేఘాల మీద 7బీ కాల్వ నిర్మాణం పూర్తి చేశారు. కానీ.. అధికారుల సాంకేతిక లోపంతో 60 క్యూస్కెకుల డిజైన్ ఉన్న కాల్వ 30 క్యూసెక్కులు మాత్రమే పారుతున్నది. రెండు చోట్ల నిర్మించిన బ్రిడ్జీలు కాల్వ కంటే దిగువకు ఉండడంతో నీటికి అడ్డు తగిలి కాల్వకు గండ్లు పడుతున్నాయి. గుడిపల్లి వాగుపై నిర్మించిన అక్విడెన్సీ కూడా డిజైన్ లోపంతో నీరు సరిపడా ప్రవహించడం లేదు. 30 క్యూసెక్కులకు మించి నీటిని విడుదల చేస్తే కాల్వకు గండ్లు పడుతున్నాయి. ఇటీవల అంగడిపేట స్టేజీ బ్రిడ్జి వద్ద గండి పడడంతో రైతులే పూడ్చుకోవాల్సిన పరిస్థితి. ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి డీ-7బీ కాల్వ సాంకేతిక లోపాన్ని సవరించి సరిపడా నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

కాల్వలోకి నీళ్లు సరిగా రావడం లేదు

ఈ కాల్వలో సరిపడా నీళ్లు ఏన్నడూ రావు. ఇప్పుడు సాగర్ నిండా నీళ్లున్నా వదలడం లేదు. మా పొలం పక్కనే బ్రిడ్జి కిందికి కట్టడం వల్ల కాల్వకు గండి పడితే మొన్ననే రైతులు పూడ్చుకున్నారు. మొదట ఉన్న మాకే నీళ్లు సరిగా రాకుంటే కింద వాళ్లకు కష్టమే. నాట్లు వేసుకునే సమయంలో కాల్వల నీళ్లు రాకపోతే ఎలా. కాల్వను సరి చేసి నీళ్లు వదలాలి.

- రమావత్ మంత్రియా, దుబ్బ తండా

నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

దళిత బంధు నిధులు ఇప్పించాలని ధర్నా

నల్లగొండ, ఆగస్టు 12 : రెండో విడుతగా మంజూరైన దళిత బంధు నిధులు ఇప్పించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళితబంధు కమిటీ చైర్మన్ కందుల లక్ష్మయ్య మాట్లాడుతూ రెండో విడుతగా తమను లబ్ధిదారులుగా ఎంపిక చేసి తమ పేర్లను పోర్టల్‌లో నమోదు చేసి ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం నిధులు సైతం విడుదల చేయగా..

ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు ఇవ్వడం లేదని తెలిపారు. తమకు మంజూరైన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బడుపుల శంకర్, అద్దంకి రవీందర్, నాగయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

నకిరేకల్ మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

నకిరేకల్, ఆగస్టు 12 : నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ (బీఆర్ఎస్)పై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. గత నెల 22న 16మంది కౌన్సిలర్లు చైర్మన్‌పై అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీంతో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కౌన్సిలర్లకు నోటీసులు అందజేశారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రిసైడింగ్ అధికారి, నల్లగొండ ఆర్డీఓ రవి సమక్షంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణితో పాటు 15మంది కౌన్సిలర్లు, కమిషనర్ డి.బాలయ్య, తాసీల్దార్ ఎస్‌కే జమీరొద్దీన్ హాజరయ్యారు. కోరం నిబంధన ప్రకారం 20మంది సభ్యుల్లో 14 మంది హాజరు కావాల్సి ఉండగా.. 16 మంది రావడంతో ఓటింగ్ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి 16మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారని, వ్యతిరేకంగా ఎవరూ ఓటు వేయలేదని ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీఓ రవి తెలిపారు. అవిశ్వాసం రిపోర్టును కలెక్టర్‌కు అందజేస్తామని, కలెక్టర్ ఎలక్షన్ కమిషన్‌కు పంపిస్తారని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చైర్మన్ ఎన్నిక తేదీని నిర్ణయించనున్నట్లు చెప్పారు. దీంతో గత నెల 22నుంచి ఉత్కంఠ రేపుతున్న మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ఎట్టకేలకు ముగిసింది. కాగా, 2021 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 11మంది, ఏఐఎఫ్‌బీ నుంచి ఆరుగురు, కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు, ఒకరు స్వతంత్ర అభ్యర్థి కౌన్సిలర్లుగా గెలుపొందారు.

రూ.130.79 కోట్లతో మున్సిపాలిటీని అభివృద్ధి చేశాం

● అవిశ్వాసం నెగ్గించేందుకు కౌన్సిలర్లకు ప్రలోభాలు : నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్

నకిరేకల్, ఆగస్టు 12 : నకిరేకల్ మున్సిపాలిటీని బీఆర్ఎస్ హయాంలో రూ.130.79 కోట్లతో అభివృద్ధి చేశామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికార బలంతో తమ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురి చేసి తనపై అవిశ్వాసం పెట్టిందని మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. తనపై పెట్టిన అవిశ్వాసాన్ని ఖండిస్తూ సోమవారం నకిరేకల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల నుంచి ఎన్నో అవమానాలకు గురయ్యానని, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హయాంలో విడుదల చేసిన రూ.16 కోట్లు నిధులున్నా, డబ్బులు లేవని జాప్యం చేస్తూ 100 పడకల ఆస్పత్రిని, సెంట్రల్ లైటింగ్, రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేశారని తెలిపారు. తెలంగాణ సమాజం కోసం బీఆర్ఎస్ పార్టీ ఏర్పడిందని, పదవులు ఉన్నా లేకున్నా ప్రజాక్షేత్రంలో ఉంటూ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆదేశాల మేరకు ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. గతంలో తన మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు సహకరించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీర్, గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ప్రజాతీర్పును గౌరవిస్తానని అవిశ్వాసాలను కాదని తెలిపారు. ఈ సమావేశంలో రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు సామ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ పల్లె విజయ్, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, రాచకొండ వెంకన్న, నాయకులు చౌగోని శంకర్ పాల్గొన్నారు.

బూరుగడ్డ వాసికి 7 ప్రభుత్వ ఉద్యోగాలు

గోపి

హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 12 : మండలంలోని బూరుగడ్డ మాచవరం గ్రామానికి చెందిన చింతల చెర్వు గోపి ఏడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించుకున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో పంచాయతీరాజ్ ఏఈఈ ఉద్యోగం పొందగా.. అంతకుముందు జీహెచ్ఎంసీలో టెక్నికల్ అసిస్టెంట్, రైల్వేలో గ్రూప్ - డీ ఉద్యోగం, పంచాయతీ కార్యదర్శి గ్రూప్ -4, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించారు. గ్రూప్ -1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి మెయిన్స్‌కు సిద్ధమయ్యారు. గోపి చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయినా నిరాశ, నిస్పృహలకు లోనుకాకుండా ఆత్మవిశ్వాసం, పట్టుదలతో చదివి ఏకంగా 7 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పి మోటివేటర్‌గా ఉన్న గోపి చిన్నాన్న చింతలచెర్వు ఉపేందర్ పర్యవేక్షణలో సాధించిన ఈ విజయాలు గ్రామ యువతోపాటు ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. గోపిని గ్రామ యువత సన్మానించి మరెన్నో విజయాలు సాధించి గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.